బోనాల పండుగ ప్రారంభానికి ముందే అభివృద్ధి పనులు


గాజుల అంజయ్యను సన్మానిస్తున్న ప్రతినిధులు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల ప్రారంభానికి ముందే ఆయా ఆలయాల వద్ద అవసరమైన అన్ని అభివృద్ధి పనులను చేయించుకుందామని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య పాతబస్తీలోని వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులను కోరారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పాతబస్తీలోని ఏయే ఆలయాల వద్ద ఎలాంటి అభివృద్ధి పనులను చేపట్టాలనే విషయాలపై తనకు వినతి పత్రాలను అందజేస్తే.. సంబంధిత అధికారులను సంప్రదించి ఆయా పనులను చేయించడానికి వీలు కలుగుతుందన్నారు. బోనాల జాతర ఉత్సవాల ప్రారంభానికి ముందే అవసరమైన మేరకు అన్ని పనులను చేయించడానికి తాను కృషి చేస్తానన్నారు. ఇందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలను అందజేయనున్నామన్నారు. సర్వసభ్య సమావేశంలో పాతబస్తీకి చెందిన పలు ఆలయాలకు చెందిన కమిటీ ప్రతినిధులు, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్లు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం గాజుల అంజయ్యను సన్మానించారు.

ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో లాల్‌దర్వాజా బోనాలు నిర్వహించాలి


మాట్లాడుతున్న పోసాని సురేందర్ ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను ప్రత్యేక అధికారి నేతృత్వంలో నిర్వహించాలని ఆలయ మాజీ ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్లు పోసాని సురేందర్ ముదిరాజ్, బద్రీనాథ్ గౌడ్, శివకుమార్ యాదవ్, మాజీ కోశాధికారి పోసాని సదానంద్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. లాల్‌దర్వాజాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..2022–23 సంవత్సరంలో ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్లుగా ఉన్న తాము ఆదాయ, వ్యయాలకు సంబంధించిన నివేదికను సమర్పించలేదంటూ ఇటీవల ప్రస్తుత కమిటీ సభ్యులు చేసిన ఆరోపణలు సత్యదూరమన్నారు. తాము నివేదికను అందజేసి సంతకాలు కూడా తీసుకున్నామని వెల్లడించారు. ఇదే నివేదికను దేవాదాయ శాఖ, జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్, డీసీపీ, ఏసీపీ, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌కు కూడా అందించామని తెలిపారు. తన వ్యక్తిగత అంశాలను బహిర్గతం చేసినందుకు కమిటీ సభ్యులపై పరువునష్టం దావా వేయనున్నట్లు మాజీ కోశాధికారి పోసాని సదానంద్ ముదిరాజ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పేదలకు అండగా మజ్లిస్: ఎమ్మెల్యే కౌసర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పేదలకు అండగా మజ్లిస్ పార్టీ ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం కార్వాన్, గోల్కొండ డివిజన్‌లకు చెందిన పలువురు టోలిచౌకీలోని ఆయన కార్యాలయానికి చేరుకొని కలిశారు. ఈ సందర్భంగా వారు తమ తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఓ మహిళ తనకు మూడు నెలల నుంచి బ్యాంక్ ఖాతాలో పెన్షన్ రావడం లేదని ఎమ్మెల్యేకు వివరించింది. మరో వ్యక్తి తన కూతురు వివాహానికి షాదీ ముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకున్నానని ఇప్పటి వరకు తనకు ఎటువంటి సమాచారం రాలేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు నెలల నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడం తదితర కారణాల వల్ల సంక్షేమ పథకాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. ఈ నెల నుంచి దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైందని ఆయన అన్నారు. త్వరలో తాను జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులను కలిసి సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అందజేస్తానన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న రాజేశ్వర శర్మ తదితరులు

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురుకుంట్ల రాజేశ్వరశర్మ విజ్ఞప్తి చేశారు. లోక కల్యాణం కోసం పాటుపడే వైదిక బ్రాహ్మణులకు గత ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు విజ్ఞప్తి చేశామని, త్వరలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. ఈ మేరకు హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఉప్పల బాలసుబ్రహ్మణ్యం, మహిళా విభాగం కన్వీనర్ అర్పితతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వల్ల కొంత మందికి మాత్రమే న్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఏర్పాటులో చైర్మన్, డైరెక్టర్స్‌లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నియమించకుండా క్షేత్రస్థాయిలో తమ సంఘం నాయకులను నియమించాలని కోరారు. ఈ సమావేశంలో నారాయణం చక్రవర్తి శర్మ, వేమవరంపు వెంటరమణ, చిన్నయ్య శర్మ, మాడా పాపయ్యశర్మ, కేశవనాథశర్మ, తోట ప్రకాష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సంస్కృతి కళారాధన బిరుదులతో సత్కారం


చిన్నారి కళాకారులతో నటుడు జెమినీ సురేష్

నాంపల్లి: సంస్కృతి సర్వీసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో సంస్కృతి కళారాధన శీర్షిన ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. ఈ ప్రదర్శనలో కళాకారులకు కళాశ్రీ, వాద్యశ్రీ, స్వరశ్రీ, కళా విశారద బిరుదులతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన నటులు జెమినీ సురేష్ హాజరై ప్రారంభించారు. ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను అభినందించారు. కళలను ప్రోత్సహించడానికి సంస్కృతి సర్వీసెస్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ అరిపిరాల కల్యాణ్ శాస్త్రి, నటులు వెంకటగిరిధర్, నటి గీతాసింగ్, యాంకర్ అనుమప పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న ఆదిల్ షరీఫ్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ పేర్కొన్నారు. జూన్ 26వ తేదీ నుంచి నిర్వహించే ఐఎన్‌టీయూసీ 75 సంవత్సరాల ప్లాటీనియం జూబ్లీ వేడుకలకు రావాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రిని సన్మానించారు. అనంతరం ఆదిల్‌షరీఫ్ మాట్లాడుతూ..జీహెచ్ఎంసీలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. గత పదేళ్లపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు ఏ మాత్రం పరిష్కరించలేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జానకిప్రసాద్ చంద్రశేఖర్, విజయ్‌కుమార్ యాదవ్, శివకుమార్, యాదగిరి, జయప్రకాష్, ఖాజాపాషా, లవకుమార్, మహేష్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తదితరులు

నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి

చార్మినార్: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో ఆశించిన ఫలితాలు సాధిస్తోందని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టడంతో ఆదివారం రాత్రి దారుషిఫాలోని తన కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మతాలకు అతీతంగా దేశాభివృద్ధి కేవలం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోనే సాధ్యమన్నారు. దేశ ప్రజలు ఆయనకు ఎంపీలను గెలిపించడం ద్వారా సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు షెట్టి ప్రవీస్ కుమార్, మహ్మద్ వసీముద్దీన్, దిగ్విజయ్ జైన్, నవాబ్ షఫత్ అలీ ఖాన్, దియానత్ అలీ ఖాన్, ప్రదీప్ జైశ్వాల్, మహ్మద్ హాషీం తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

చెరువుల ఉనికి ప్రశ్నార్థకం..!

- చెరువుల సుందరీకరణ పట్టించుకోని అధికారులు
- వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారుతున్న వైనం
- పిల్లల ప్లే గ్రౌండ్‌గా మారిన షేక్‌పేట్ ఎర్రకుంట చెరువు


నీరులేక ప్లే గ్రౌండ్‌గా మారిన షేక్‌పేట్ ఎర్రకుంట చెరువు

గోల్కొండ: అధికారుల నిర్లక్ష్యంతో శతాబ్దాల చరిత్ర గల చెరువులు అధ్వానంగా మారుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా చెరువుల అభివృద్ధికి ముందుకు రావడం లేదు. స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్‌జీఓలు అడపదడప చెరువుల వద్ద సుందరీకరణ, పరిరక్షణ కార్యక్రమాలు చేస్తున్నా అధికారుల్లో చలనం లేకుండా పోతోంది. ఆక్రమణలతో కుంచించుకుపోతున్న చెరువులు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో వాటి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

విన్నపాలు బుట్టదాఖలు..

షేక్‌పేట్‌లోని ఎర్రకుంట చెరువు ఒకప్పుడు షేక్‌పేట్‌వాసులకు ఆహ్లాదాన్ని పంచేది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేడు అది నీరు లేక ఒక మురికి కుంటగా మారింది. అదే విధంగా షేక్‌పేట్ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లోని చెరువు సైతం అధికారుల నిర్లక్ష్యానికి చిహ్నంగా వెక్కిరిస్తోంది. ఈ చెరువులో వ్యర్థాలు నిండి పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. గతంలో వేసిన ఇనుప ఫెన్సింగ్ పూర్తిగా ధ్వంసమైంది. అయినా కూడా అధికారులు ఈ చెరువును సుందరీకరించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఎన్‌జీఓలు, స్థానిక కాలనీలవాసులు చెరువుల అభివృద్ధిపై అధికారుల దృష్టికి తెస్తున్నారు. అయితే అప్పుడప్పుడు స్పందించిన అధికారులు చేస్తాం, చూస్తాం అంటూ ప్రజల విన్నపాలను బుట్టదాఖలు చేస్తున్నారు. పలుమార్లు చెరువులను సందర్శించి హామీలు ఇచ్చి వెళ్తున్నారు. అభివృద్ధికి మాత్రం నిధులు మిలిగించడం లేదు.


పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో అంబేడ్కర్‌నగర్ కొత్తచెరువు

నిధుల లేమితో..

చెరువుల అభివృద్ధితో పాటు సుందరీకరణకు సంబంధిత శాఖ అధికారులు నిధులు విడుదల చేయడం లేదు. చెరువులను పరిరక్షిస్తున్నామంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు చేస్తున్న ప్రకటనలు కార్యరూపం దాల్చడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు హామీ ఇచ్చినప్పుడల్లా చెరువు బాగుపడుతుందని స్థానికులు పడుతున్న సంబరాలు గాలిలో కలిసిపోతున్నాయి. షేక్‌పేట్ ఎర్రకుంట చెరువు ఒక మురికి కుంటగా మారింది. నీరు లేని చెరువు ప్రదేశంలో స్థానిక విద్యార్థులు క్రికెట్‌తో పాటు ఇతర ఆటలు ఆడుకుంటూ చెరువును కాస్తా ప్లేగ్రౌండ్‌గా మార్చుకున్నారు. దీనికి వేసిన ఫెన్సింగ్ ఎప్పుడో ధ్వంసమైంది. చెరువు ఫెన్సింగ్ పొడవునా వ్యర్థాలు కుళ్లి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ఈ చెరువు పొడవున నడవాలంటేనే స్థానికులు భయపడుతున్నారు.

ప్రత్యేకంగా ట్రాక్ ఏర్పాటు చేయాలి..

అంబేడ్కర్‌నగర్ కొత్త చెరువు సైతం దుర్గంధ భరితంగా మారింది. ఈ చెరువు నీరు రంగుమారి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. వ్యర్థ పదార్థాలు చెరువులోని నీటిలో తేలియాడుతున్నాయి. చెరువులో ధోబీఘాట్ కూడా ఉంది. చెరువు దుస్థితితో రజకులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. చెరువు ఫెన్సింగ్ చుట్టూ అభివృద్ధి కోసం తవ్విన మట్టి చెరువులోనే వేయడంతో మట్టికుప్పలు గుట్టల్లా పేరుకుపోయాయి. షేక్‌పేట్ ఎర్రకుంట చెరువుతో పాటు కొత్త చెరువును అభివృద్ధి చేస్తే ఎన్నో కాలనీలవాసులకు ప్రయోజనకరంగా ఉంటుంది. చెరువు చుట్టూ ఫెన్సింగ్ పొడవునా మార్నింగ్ వాకర్స్ కోసం ప్రత్యేకంగా ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు


సంబరాలు చేస్తున్న గోపాల్‌జీ, ప్రేమ్‌సింగ్ రాథోడ్ తదితరులు

అబిడ్స్: బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. ఆదివారం కేంద్రంలో మరోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో అబిడ్స్ కట్టెలమండి బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ నాయకులు మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ఫొటోను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కోఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, ఉమాశంకర్, సుధాకర్ రెడ్డి, దాసరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


సూర్య ప్రకాష్‌ను సన్మానిస్తున్న లాల్‌దర్వాజా ఆలయ కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం తరపున పీహెచ్‌డీ పట్టా పొందిన ఎంఎస్ఎస్ లా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.సూర్యప్రకాష్‌ను లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ తరపున ఆదివారం సన్మానించారు. బాలాగంజ్‌కు చెందిన అతడిని ఆలయ మాజీ చైర్మన్ కె.వెంకటేష్, కన్వీనర్ జి.అరవింద్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు మారుతీ యాదవ్, ఎ.చంద్రకుమార్, సాంస్కృతిక కార్యదర్శి వినోద్ కుమార్, ప్రచార కార్యదర్శి కె.శేషు నారాయణలు శాలువా కప్పి సత్కరించారు.

ఘనంగా మహా రాణాప్రతాప్ జయంతి


వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ మెట్టు శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: మహారాణాప్రతాప్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీర్‌క్షత్రియ రాజ్‌పుత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తెలంగాణ రాష్ట్ర డెంటిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించారు.

గోల్కొండ కోట బోనాలకు దేశవ్యాప్త గుర్తింపు


సమావేశంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, రాజువస్తాద్ తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత దేశవ్యాప్త గుర్తింపు లభించిందని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం సంఘ సేవకుడు, గోల్కొండ జగదాంబిక అమ్మవారి వృత్తివార్ల సంఘం ప్రధాన సలహాదారులు ఎస్.రాజువస్తాద్ పర్యవేక్షణలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అమ్మవారి వృత్తిపనివారి సమస్యల పరిష్కారం, నూతన కార్యవర్గం, ఎంపిక తదితర విషయాలపై చర్చించారు. ఏసీపీ మాట్లాడుతూ.. గోల్కొండ కోట బోనాల ఏర్పాట్ల విషయం గురించి తనకు బాగా తెలుసు అని గతంలో తాను గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశానన్నారు. ఎస్.రాజువస్తాద్ మాట్లాడుతూ.. బోనాల నిర్వహణలో వృత్తిపనివారి పాత్ర ఎంతగానో ఉందన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, గోల్కొండ మహంకాళీ ఆలయ పూజారి బి.సురేష్‌చారి, నర్సింహ, బాబురావు, శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

హమాలీలకు 15 శాతం జీతభత్యాలు పెంపు


ఒప్పంద పత్రాన్ని అధ్యక్షుడు ధన్‌రాజ్‌కు అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: న్యూ ఉస్మాన్‌గంజ్‌లో హమాలీలకు 15 శాతం జీతభత్యాలు, డబ్బులు పెంచుతున్నట్లు న్యూ ఉస్మాన్‌గంజ్ హమాలీ సంఘం అధ్యక్షుడు ఎస్.ధన్‌రాజ్ వెల్లడించారు. భాగ్యనగర్ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో హమాలీ సంఘానికి ఆదివారం ఒప్పందం కుదిరినట్లు అధ్యక్షుడు ధన్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ధన్‌రాజ్ మాట్లాడుతూ..తాము 20 శాతం హమాలీల జీతభత్యాలు పెంచాలని కోరగా ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు 15 శాతం పెంచారన్నారు. అందరి సమక్షంలో ఒప్పంద చేసుకున్నామన్నారు. హమాలీల కోసం న్యూ ఉస్మాన్‌గంజ్ హమాలీ సంఘం రేయింబవళ్లు కృషి చేస్తుందన్నారు. హమాలీలకు రాత్రి సమయం 10 దాటితే రూ.50 భోజనానికి ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి


కోటలో పర్యాటకుల కిటకిట


ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో గుల్జార్‌హౌజ్ నడిరోడ్డుపైనే సందర్శకులు

చార్మినార్: పాఠశాలలకు ఇక రెండు రోజుల్లో సెలవులు ముగుస్తుండడంతో ఆదివారం పాతబస్తీలోని పర్యాటక స్థలాలన్నీ సందర్శకులతో కిటకిటలాడాయి. చార్మినార్ కట్టడంతో పటు మక్కా మసీదు, లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్, హెచ్ఇహెచ్ నిజాం మ్యూజియం, సాలార్‌జంగ్ మ్యూజియం తదితర పర్యాటక ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. ఇక సందర్శకుల తాకిడి ఎక్కువ కావడంతో పాతబస్తీకి కొత్తగా వచ్చిన వారందరూ పార్కింగ్ సమస్యతో పాటు ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొన్నారు. నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు, దారుషిఫా చౌరస్తా నుంచి మీరాలంమండి, ఎతేబార్ చౌక్, కోట్ల అలీజా ద్వారా బీబీబజార్ చౌరస్తా వరకు, మదీనా నుంచి పురానా పూల్ చౌరస్తా, కిషన్‌బాగ్ తదితర రోడ్లలో ట్రాఫిక్ జాం కనిపించింది.

గోల్కొండ కోటలో..

గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు పూర్తి కానున్న నేపథ్యంలో తమతమ పిల్లలతో వేలాది కుటుంబాలు కోటకు తరలివచ్చాయి. ఉదయం 7.30 గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి కోటకు పర్యాటకులు రావడం ప్రారంభమైంది. సాయంత్రం 6 గంటల వరకు కోటలోని నగీనాబాగ్, ఆయుధాగారం, రాణిమహల్, అక్కన్నమాదన్న కార్యాలయ ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు

గోల్కొండ: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని ఆదివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆధ్వర్యంలో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతువుల అమ్మకాలు బహిరంగ ప్రదేశాల్లో జరగరాదని, జంతువుల అమ్మకాల వల్ల స్థానికులకు ఇబ్బందులు కలగకూడదన్నారు. పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్, కమిటీ అధ్యక్షుడు ఆబీద్, గోల్కొండ బీఎస్ఐ రఫీ, మైత్రి కమిటీ సభ్యులు సైరుద్దీన్, అశోక్‌కుమార్, చాంద్‌పాషా తదితరులున్నారు.

క్రమశిక్షణతో మంచి ఫలితాలు


మాట్లాడుతున్న ముఫ్తీ మహ్మద్ వసీమ్ అహ్మద్

గోల్కొండ: క్రమశిక్షణతో మంచి ఫలితాలు వస్తాయని మదర్సా ఇస్లామియా మారీఫుల్ ఇస్లాం ప్రిన్సిపాల్ ముఫ్తీ మహ్మద్ వసీమ్ అహ్మద్ అన్నారు. శనివారం మదర్సాలో వేసవి శిక్షణ శిబిరం పూర్తి చేసుకున్న విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..40 రోజుల వేసవి శిక్షణ శిబిరంలో ఖురాన్ గ్రంథ పఠనంతో పాటు మానవ విలువలు వాటి ప్రాధాన్యంపై కూడా పిల్లలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌తో కలిసి ఆయన ప్రశంస పత్రాలు, బహుమతులు అందించారు.

గోల్కొండ కోట అమ్మవార్ల వృత్తిపని వార్ల సంఘం అధ్యక్షుడిగా సాయిబాబాచారి



గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని వార్ల సంఘం అధ్యక్షుడిగా బి.సాయిబాబాచారి ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం ప్రధాన సలహాదారుడు ఎస్.రాజువస్తాద్ ఆధ్వర్యంలో సంఘం సభ్యుల సమావేశం ఇబ్రహీంబాగ్‌లో జరిగింది. ఈ సందర్భంగా సభ్యులంతా సాయిబాబాచారిని మరోసారి తమ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాయిబాబాచారి మాట్లాడుతూ.. గత దశాబ్ద కాలంగా సంఘం అధ్యక్షుడిగా ఉంటూ సంఘం సభ్యుల గుర్తింపు కోసం కృషి చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళీ ఆలయ పూజారి బి.సురేష్‌చారి, తల్వార్ శివ పోతరాజు, అశోక్ పోతరాజు, వినోద్‌కుమార్, నర్సింగ్‌రావు, శ్రావణ్, ఏ.రాజు పాల్గొన్నారు.

గ్రూప్–1 అభ్యర్థుల ఆందోళన

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష అభ్యర్థులు అబిడ్స్‌లోని స్టాన్లీ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. బ్యాగ్‌లు, ఫోన్లను భద్రపరిచేందుకు ఎలాంటి సదుపాయాలు కల్పించలేదని మండిపడ్డారు. తమ వస్తువులకు సరైన భద్రత కల్పించాలని వాగ్వాదానికి దిగారు. ఆందోళన చేసిన అభ్యర్థులకు పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించి లోపలికి వెళ్లారు.

వ్యక్తిపై హత్యాయత్నం..కేసు నమోదు

డబీర్‌పురా: ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..డబీర్‌పురా బోధేఅలీషా కిడికి జఫరియా ఆసుపత్రి సమీపంలో ఈ నెల 8న రాత్రి ఖాజం అలీ అనే వ్యక్తిపై రహమాన్, షబ్బీర్ అలీ, చోటు, మహ్మద్ హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన ఖాజా అలీని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు సహకారం అందించడం ప్రశంసనీయం

గన్‌ఫౌండ్రీ: పేద విద్యార్థులకు సహకారం అందించడం ప్రశంసనీయమని తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్‌సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఎస్ఎస్సీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 200 మంది వీరశైవ లింగాయత్ విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు భూపతి రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షులు పటోళ్ల సంఘమేశ్వర్, యువజన సంఘం అధ్యక్షులు పెద్దపట్ల భరత్, కార్యదర్శి సోమేశ్వర్, కేంద్ర కమిటీ సభ్యులు మల్లిఖార్జున్, శెట్టి శివకుమార్, ధినేష్‌పాటీల్, మహిళా అధ్యక్షురాలు సూర్యశ్రావణి తదితరులు పాల్గొన్నారు.


స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న వీరశైవ లింగాయత్‌లు